## బీసీలకు '42శాతం' అమలు కావడం ఖాయం



సీఎం రేవంత్‌రెడ్డి, మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగభూషణం

రాంనగర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు కావడం ఖాయమని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.నాగభూషణం తెలిపారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీలో చేపట్టిన ధర్నా విజయవంతం కావడం పురస్కరించుకొని సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను ఆయన సోమవారం కలిశారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ, బీసీ రిజర్వేషన్లు సాధించే వరకు కేంద్ర ప్రభుత్వంపై సీఎం రేవంత్‌రెడ్డి ఒత్తిడి తెస్తారని తెలిపారు. బీసీలపై కేంద్ర ప్రభుత్వం చిన్న చూపు చూడకుండా 42శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని కోరారు. బీసీ రిజర్వేషన్ల కోసం సీఎం చేపట్టే ఉద్యమానికి తెలంగాణలో ఉన్న బీసీలందరూ సీఎం రేవంత్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని నాగభూషణం కోరారు.

## కేంద్రమంత్రులు, బీజేపీ ఎంపీలు సహకరించాలి

చిక్కడపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అసెంబ్లీలో ఆమోదించి కేంద్రానికి పంపిన బీసీ బిల్లును కేంద్రం ఆమోదించేలా రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు, ఎంపీలు సహకరించాలని తెలంగాణ బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు ఆరే.మహేందర్ కోరారు. చిక్కడపల్లిలో బీసీ ఐక్యవేదిక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మహేందర్‌మాట్లాడుతూ తెలంగాణ నుంచి మంత్రులుగా ఉన్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తోపాటు బీజేపీ ఎంపీలు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ప్రధానిని ఒప్పించాలన్నారు. లేనిపక్షంలో బీజేపీ బీసీల వ్యతిరేకిగా ముద్ర పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజేష్, విజయ్‌కుమార్, దశరథం తదితరులు పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామి హుండీ ఆదాయం రూ.2.01 లక్షలు

చిక్కడపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయం హుండీ ఆదాయం రూ.2,01,624 వచ్చింది. సోమవారం ఆలయం హుండీని ఈవో మాచర్ల దేవనాథం, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ బి.సురేఖ పర్యవేక్షణలో లెక్కించారు. ఈ సందర్భంగా దేవనాథం మాట్లాడుతూ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయడానికి భక్తులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు ఎన్.శ్యామ్‌కుమార్, ముఖ్యఅర్చకులు బుగ్గా లక్ష్మీపతి శర్మ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ నాగేశ్వరరావు తెలిపారు. ఆజామాబాద్ ఐఈ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, ప్రివెంటివ్ మెడిసిన్ పరిధిలో 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

## ఘనంగా రాధారాణి ఆర్ట్స్, మ్యూజికల్స్ ప్రారంభం

చిక్కడపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నూతన సాంస్కృతిక సంస్థ రాధారాణి ఆర్ట్స్, మ్యూజికల్స్ ప్రారంభోత్సవ వేడుకలు సోమవారం రాత్రి ఘనంగా జరిగాయి. అతిథులుగా విచ్చేసిన వంశీ రామరాజు, కిన్నెర రఘురామ్, ఎస్‌బిఐ మాజీ ఏజీఎం త్రినాథరావు, సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మ, గోపీకృష్ణ, కమలా శాస్త్రి, ఆమంత తదితరులు సంస్థ లోగోను ఆవిష్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సంస్థ వ్యవస్థాపకులు రాధారాణి, రంగారావు తమ సంస్థ ఆశయాలను వివరించారు. ఈ సందర్భంగా రాధారాణి మాతృమూర్తి చిట్టూరి జానకీదేవికి నివాళులర్పించారు. గానవిభావరి జరిగింది.

## ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

రాంనగర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల సమన్వయ కమిటీ చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల సమన్వయ కమిటీ ఆవిర్భావ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి 18 సంఘాల నాయకులు హాజరయ్యారు. చైర్మన్‌గా జస్టిస్ చంద్రకుమార్, సలహాదారుగా పాశం యాదగిరి, విమలక్క, నలమాసకృష్ణను ఎన్నుకున్నారు. రామ్‌రెడ్డి, కుమారస్వామి, దుర్గప్రసాద్, రూబెన్, విల్సన్, ఉద్య శంకర్, పాండు, రాజు, నరసింహ, కృష్ణకుమార్, వెంకటేశం, సుదర్శన్‌రెడ్డి, బద్రి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## యువత సన్మార్గానికి చతుర్మాస దీక్షలు దోహదం



స్వామీజీ ఆశీర్వాదం తీసుకుంటున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

బర్కత్‌పుర, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు ఉత్తరాది మఠం పీఠాధిపతి సత్యాత్మ తీర్థ శ్రీపాదుల స్వామిని సోమవారం కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. సెప్టెంబర్ 7వ తేదీ వరకు జరగనున్న చతుర్మాస దీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ దీక్షలు యువత సన్మార్గంలో నడవడానికి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి అభయ్‌పాటిల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్, మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు మనవడు సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

### రాఘవేంద్రస్వామి బోధనలు ఆచరణీయం

రాఘవేంద్రస్వామి బోధనలు అందరికీ ఆచరణీయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు అన్నారు. లింగంపల్లి చౌరస్తాలోని రాఘవేంద్ర స్వామి బృందావన సమితిలో నిర్వహిస్తున్న రాఘవేంద్ర స్వామి ఆరాధన మహోత్సవంలో ఆయన పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో బృందావన సమితి అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి, కార్యదర్శి బీపీ రాఘవేందర్‌రావు, ట్రస్టీ ఎంఆర్ అనంతమూర్తి ఆచార్య తదితరులు పాల్గొన్నారు.



ఊరేగింపులో అందరినీ ఆకట్టుకున్న ఫలహార బండ్ల కళాకారుల ప్రదర్శన

## ఘనంగా ఫలహార బండ్ల ఊరేగింపు

ముషీరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ బొంతల బస్తీ, రంగానగర్‌లోని కట్టమైసమ్మ ఆలయం, నల్లపోచమ్మ ఆలయం వద్ద పోతరాజుల విన్యాసాలు, ఫలహార బండ్ల ఊరేగింపు సోమవారం సాయంత్రం కనుల పండువగా సాగింది. అమ్మవారికి ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నర్సింగ్‌రావు, బీజేపీ మహాకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై. శ్రీనివాస్‌రావు, ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీఉప్పలమ్మ దేవాలయంలో ..

చిక్కడపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లోని లక్ష్మీఉప్పలమ్మ దేవాలయంలో శ్రావణ మాస బోనాల సందర్భంగా తొట్టెల ఊరేగింపును సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ ముఖ్యఅతిథులుగా పాల్గొని తొట్టెల ఊరేగింపును ప్రారంభించారు. ఆలయం చైర్మన్ వై.సంజీవరెడ్డి, కోశాధికారి పవన్‌కుమార్, కమిటీ సభ్యులు ప్రసన్నలక్ష్మి, పద్మావతి, రాధ, పవన్, అనిల్‌కుమార్, కుమార్, సోనమ్ తదితరులు పాల్గొన్నారు.



సుదర్శన హోమంలో పాల్గొన్న ఆలయ కమిటీ చైర్మన్ ఆనంద్ ముదిరాజ్, మాజీచైర్మన్ రవియాదవ్, మాజీ కార్పొరేటర్ తదితరులు



హోమంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

# ఘనంగా సుదర్శన హోమం

### హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్, పలువురు నేతలు

రాంనగర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్ డివిజన్‌లోని రాంనగర్ రామాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రావణ మాసం పురస్కరించుకొని సోమవారం ఉదయం సుదర్శన హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వెంకటరమణ చారి హోమాన్ని నిర్వహించారు. ఈ వేడుకలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఆలయ కమిటీ చైర్మన్ ఆనంద్ ముదిరాజ్, మాజీ చైర్మన్ బి.రవియాదవ్, మాజీ కార్పొరేటర్ రావి వెంకట్‌రెడ్డి, రాంనగర్ పోచమ్మ దేవాలయం చైర్మన్ రాజేశ్వరిగౌడ్, ఈవో లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు కె సురేందర్, జల్లా భిక్షపతి, నేత శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### యువత విద్యా, ఉపాధి రంగాల్లో రాణించాలి

రాంనగర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): యువత నైపుణ్యాలను పెంపొందించుకొని స్వయం ఉపాధి రంగాల్లో ఉద్యోగాల్లో రాణించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ సూచించారు. రసరంజని స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గిడియన్ బాబు ఆధ్వర్యంలో గోల్కొండ చౌరస్తాలో ఎంబీచర్చ్ ఆవరణలో ఏర్పాటు చేసిన యూత్ మేళాను ఎమ్మెల్యే ప్రారంభించారు. చదువులు పూర్తయిన విద్యార్థులు నిత్యం కొత్త అంశాలను నేర్చుకోవాలని సూచించారు. అధునాతన సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన నాయకులు ముఠా జైసింహ, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ దీపన్ జాన్, రెవరెండ్ గుమ్మడి జోవెల్, బిషప్ డాక్టర్ షామిల్ జాన్, డాక్టర్ శ్యామ్ అబ్రహం, ఆర్.మోజెస్, కృపాకర్, మధు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల్లో నులిపురుగులను నిర్మూలించాలి

- వైద్యాధికారి డాక్టర్ మనోజ్ రెడ్డి



చిన్నారులకు మాత్రలు వేసిన వైద్యాధికారి డాక్టర్ మనోజ్ రెడ్డి

ముషీరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పిల్లలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండేందుకు సంవత్సరం నుంచి 19 ఏళ్ల వయసుగల పిల్లలకు నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి అన్నారు. సోమవారం జాతీయ నులుపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ముషీరాబాద్ యూపీహెచ్‌సీలో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మనోజ్‌రెడ్డి మాట్లాడుతూ... పిల్లలు పౌష్టికాహార లోపం, రక్త హీనత వల్ల నీరసంగా ఉంటారన్నారు. స్కూల్స్, కాలేజీలు, ప్రధాన కూడళ్లలో చిన్నారులను గుర్తించి ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్నామన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో నులిపురుగుల నివారణ మాత్రలను పిల్లలకు వేస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

### నులిపురుగుల నివారణ మాత్రలు వేయాలి

బర్కత్‌పుర: నులిపురుగుల నివారణకు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి కోరారు. సోమవారం డివిజన్ పరిధిలోని చెప్పల్‌బజార్, ఇందిరానగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏడాది నుంచి 19ఏళ్ల వయసుగల బాలబాలికలకు నులిపురుగుల నివారణ మాత్రలను వేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. నులిపురుగలను నివారించుకోకపోతే ఆరోగ్యంపై తీవ్రప్రభావం చూపే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరా, శోభ, సబిత, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్, నాయకులు మల్లికార్జున్, బి.భీమ్‌రాజ్ పాల్గొన్నారు.

# ముంపు ప్రాంతాల్లో శాశ్వత చర్యలు చేపట్టాలి : ఎమ్మెల్యే



వరదనీటి ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

రాంనగర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): భారీవర్షాల వల్ల లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు నిలిచి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా జీహెచ్ఎంసీ అధికారులు శాశ్వత చర్యలు చేపట్టాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. సోమవారం బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని లోతట్టు ప్రాంతాలైన బాగ్‌అంబర్‌పేటలోని వైభవ్ నగర్‌లో కూలిన ప్రహరీ , బతుకమ్మ కుంట, తిలక్‌నగర్ చౌరస్తా, ఛే నెంబర్‌చౌరస్తా తదితర వరద నీటి ముంపు ప్రాంతాలను కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బతుకమ్మ కుంట నుంచి ఓవర్‌ఫ్లో అయ్యే నీరు బస్తీలలోకి వెళ్లకుండా నాలాద్వారా వెళ్లేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. తిలక్‌నగర్ సర్కిల్ నుంచి ఛే నెంబర్ చౌరస్తా వరకు వర్షం నీరు రోడ్డుపై నిల్వకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బి.వెంకట్‌రెడ్డి, జీహెచ్ఎంసీ డీఈ ప్రశాంతి, ఏఈ పృథ్వి, వర్క్‌ఇన్‌స్పెక్టర్ రవి, హైడ్రా అధికారులు ప్రవీణ్, మోహన్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా వరద నీటిసమస్యపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టర్ రవిని ఎమ్మెల్యే మందలించారు. తాము చెప్పిన పనులు నోట్ చేసుకోకుండా ఇతరులతో మాట్లాడుకుంటే ఎలా అని ఆగ్రహించారు. ఈ పద్ధతి మానుకోవాలని, సమస్యల పరిష్కారానికి అంకిత భావంతో పనిచేయాలని సూచించారు.

# డ్రగ్స్‌ను నిర్మూలించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే..

మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య



ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో నినదిస్తున్న పీవైఎల్ నేతలు



ర్యాలీని ప్రారంభిస్తున్న గుమ్మడి నరసయ్య

చిక్కడపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, గంజాయి ఇతర మత్తుపదార్థాలను నిర్మూలించడం ప్రభుత్వ బాధ్యత అని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య అన్నారు. ఈ మత్తు పదార్థాలు యువత మానసిక ఆరోగ్యాన్ని నిర్వీర్యం చేస్తాయని వీటిని శాశ్వతంగా సమాజం నుంచి నిర్మూలించాలన్నారు. డ్రగ్స్, గంజాయి మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్త ప్రచారంలో భాగంగా ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) వారు మార్క్స్ భవన్ నుంచి ఆర్టీసీ క్రాస్‌రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. క్రాస్ రోడ్డులో ప్లకార్డులు పట్టుకుని డ్రగ్స్, మత్తు పదార్థాలను నిర్మూలించాలని పీవైఎల్ నేతలు, కార్యకర్తలు నినాదాలు చేశారు. అనంతరం డ్రగ్స్, గంజాయిల దిష్టిబొమ్మను దహనం చేశారు. ముందుగా ర్యాలీని ప్రారంభించిన గుమ్మడి నరసయ్య మాట్లాడుతూ ప్రభుత్వాలు తమ బాధ్యతగా భావించి వీటిని నిర్మూలించాలన్నారు. కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రవికుమార్, బీఎస్ కృష్ణ, భీమేష్, కిరణ్, శ్రీనివాస్, బాబు, శంకర్, సురేష్, సురేందర్, బంటిరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## రథస్థలి షెడ్, ప్రహరీని పునర్నిర్మిస్తాం



రథస్థలిని పరిశీలిస్తున్న శ్రీనాథ్‌గౌడ్, ఆలయ సిబ్బంది

చిక్కడపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): 85 సంవత్సరాల నాటి చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం రథస్థలి రేకులషెడ్, ప్రహరీని పటిష్టంగా పునర్నిర్మిస్తామని ఆలయ వ్యవస్థాపక వంశీయుడు జి.రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు శ్రీనాథ్‌గౌడ్, ఈవో అన్నపూర్ణ తెలిపారు. భారీవర్షాలకు ఆదివారం ఉదయం రథస్థలి రేకులషెడ్, ప్రహరీ కూలిపోయిందని దాన్ని తిరిగి నిర్మిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం వారు రథస్థలిని పరిశీలించారు. జీహెచ్ఎంసీ సర్కిల్15 డీఎంసీ రామానుజులురెడ్డి, బీజేపీ మహాకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్ కార్పొరేటర్ రవిచారి, మాజీ కార్పొరేటర్ బాల్‌రాజ్‌గౌడ్, టీడీపీ నేత చంద్రమోహన్‌గౌడ్ పరిశీలించారు. సోమవారం ఉదయం శిథిలాలను మున్సిపల్ సిబ్బంది తొలగించారు.

● రాంనగర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): భారీవర్షాల వల్ల కూలిన వేంకటేశ్వరస్వామి దేవాలయ రథ స్థలం షెడ్డు, ప్రహరీని దేవాదాయ శాఖ అధికారులు వెంటనే నిర్మించాలని బీజేపీ సికింద్రాబాద్ జిల్లా మహాకాళి జిల్లా అధ్యక్షుడు గుండగోని భరత్‌గౌడ్ కోరారు. భారీ వర్షానికి కూలిన షెడ్డును బీజేపీ నేతలతో కలిసి ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాదాయశాఖ, చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి కమిటీ చైర్మన్, ఈవో పర్యవేక్షణ లోపం వల్లే షెడ్డు కూలిందని పేర్కొన్నారు. గోడకూలి ద్విచక్రవాహనాలపై పడటంతో నష్టపోయిన బాధితులకు నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు గడ్డం సతీష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చాతిరి పార్థసారధి, నాయకులు జైపాల్‌రెడ్డి, కలకోట అరుణ్, శ్రీనివాస్, ఉపేందర్, బీరయ్య, హర్ష తదితరులు పాల్గొన్నారు.

## తాళ్లబస్తీలో అక్రమ కట్టడం కూల్చివేత



మెట్లను కూల్చేసిన దృశ్యం

ముషీరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ కవాడిగూడ తాళ్లబస్తీలో వెంకటేశ్వర్‌రావు నిర్మించిన అక్రమకట్టడాన్ని జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు సోమవారం కూల్చివేశారు. భవనం ముందు ఉన్న మెట్లు, అక్రమకంగా ఏర్పాటు చేసిన షెడ్లను తొలగించారు. పోలీస్ బందోబస్తు మధ్య అక్రమ నిర్మాణాలను బుల్డోజర్‌తో కూల్చివేశారు.

## నేడు చైర్మన్ ప్రమాణ స్వీకారం

ముషీరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ మహాకాళి దేవాలయ కమిటీ చైర్మన్‌గా బి.నరేష్‌కుమార్ మంగళవారం ఉదయం 11గంటలకు ప్రమాణ స్వీకారం చేయనున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు.




విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్ బీఆర్.అంబేద్కర్ కళాశాల యాజమాన్యం

## డీబీఆర్ఏ కళాశాలకు మూడోస్థానం

రాంనగర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా విశ్వవిద్యాలయం శారీరక విద్యావిభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్ కాలేజీ టోర్నమెంట్‌లో బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాల విద్యార్థులు మూడో స్థానంలో నిలిచారు. క్రికెట్, వాలీబాల్, ఖోఖో, త్రోబాల్, షెటిల్ బ్యాట్‌మెంటిన్ పోటీల్లో ఓవరాల్‌గా 15 పాయింట్లు సాధించారు. వీరికి ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ఎం.కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్‌రెడ్డి, ఓఎస్‌డీ ప్రొఫెసర్ జితేందర్‌నాయక్, డైరెక్టర్ కిషన్, డీన్ ఎల్‌బీ రాథోడ్‌లు వారికి ట్రోఫీతోపాటు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్.అంబేద్కర్ కళాశాల డైరెక్టర్ విష్ణుప్రియ, ప్రిన్సిపాల్ డాక్టర్ శేఖర్, ఏఓ డాక్టర్ కిరణ్ గెలుపొందిన విద్యార్థులను సోమవారం కళాశాలలో అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యులు రొయ్యూరి శేషసాయి, నాయకులు

## 12, 13, 14 తేదీల్లో తిరంగా యాత్ర

రాంనగర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): హర్ ఘర్ తిరంగా యాత్ర కార్యక్రమాన్ని రాంనగర్ డివిజన్‌లో జయప్రదం చేయడానికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రొయ్యూరి శేషసాయి తెలిపారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలో బీజేపీ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు గడ్డం సతీష్ ఆధ్వర్యంలో జరిగిన డివిజన్ నాయకులు, కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని పోలింగ్ బూత్‌ల పరిధిలో తిరంగా యాత్రను నిర్వహించాలన్నారు. ఈనెల 12, 13, 14 తేదీల్లో మహనీయుల విగ్రహాలను శుభ్రం చేసి దీపారాధనచేసి పూలమాలలు వేసి నివాళులు అర్పించాలన్నారు. వీర సైనికులు, పోలీసు అమర వీరుల కుటుంబాలను సన్మానించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు పార్థసారధి, నాయకులు జైపాల్‌రెడ్డి, కలకోట అరుణ్, గడ్డం నవీన్, ఉపేందర్, జక్క శ్రీనివాస్, హర్ష, వీరయ్య, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు సాయిబాబా తదితరులు

## సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలి

రాంనగర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): భారీవర్షాల వల్ల గ్రేటర్ పరిధిలో పెరుగుతున్న డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర సీజన్ వ్యాధుల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా కోరారు. సోమవారం టీడీపీ నగర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యాధులతో ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులకు రోగుల తాడికి పెరిగిందన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు నల్లెల కిషోర్, పి.బాల్‌రాజ్‌గౌడ్, ప్రకాష్, వినోద్, కిరణ్, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కవాడిగూడ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని(60) వ్యక్తి మృతదేహాన్ని గాంధీనగర్ పోలీసులు స్వాధీనం చేసుకుని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఎస్‌ఐ నరసింహ తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీనగర్ పీఎస్‌లోని న్యూబోయిగూడలో సెయింట్ జాన్‌మేరీ స్కూల్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు సమాచారం అందింది. వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆయన ఆచూకీ తెలిసిన వారు గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌లో గానీ లేదా ఫోన్ నెంబర్ 87126 60145లో గానీ సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు.